TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 57 శుక్రవారం 2-10-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## సిటీ ప్రజలపై భారం




**సిటీబ్యూరో, అక్టోబరు 1**
పాలనను సులభతరం చేస్తామంటూ విరజిమ్మిన మాటల వెనుక గ్రేటర్ పౌరుల జేబులు ఖాళీ చేసే పకా వ్యూహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. నగరంలో ఇప్పటికే భూముల సవరణ పేరిట రిజిస్ట్రేషన్ చార్జీలతో సామాన్యుడి నడ్డివిరిచిన ప్రభుత్వం, ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన 'క్యూర్ బిల్లు' చట్టం ద్వారా ప్రజలపై మరో మోయలేని ఆస్తి పన్ను భారాన్ని మోపడానికి మార్గం సుగమమం చేసింది. ఇన్నాళ్లు ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ విధానానికి తిలోదకాలు ఇచ్చి, భూములు, భవనాల మారెట్ క్యాపిటల్ వ్యాల్యూ (ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నులు లెకించే సరికొత్త పన్ను దందాకు తెరలేపారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో భూముల విలువలు కోట్లలో ఉండటంతో, ఇకపై చెల్లించాల్సిన ఆస్తి పన్ను ఊహించని స్థాయికి చేరనుంది.

## సీఈసీ రాజీనామా
# చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
- నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
- శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
- సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్




## కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

- వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
- తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
- బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
- ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
- ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
- ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
- వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
- భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
- త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం




# ఉద్యోగులకు
# తీపికబురు

### రెండు బకాయి డిఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
- ప్రభుత్వంపై ఏడాదికి రూ.2,500 కోట్లు అదనపు భారం
- వాయిదాల్లో ఏరియర్స్ చెల్లింపు
- రాష్ట్రంలో కరువు పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ
- కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని నిర్ణయం
- ఎల్ నినోపై అఖిలపక్షం
- సహాయక చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు కోరాలని నిర్ణయం
- కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన సహాయం అందించాలని కేంద్రానికి అభ్యర్థన
- త్వరలో ఢిల్లీకి రాష్ట్ర మంత్రులు
- డిమాండ్ మేరకు విద్యుత్ కొనుగోలు
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పనిచేసేందుకు నలుగురు గ్రూప్-1 అధికారులు
- కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్

/హైదరాబాద్:
దసరా సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం రేవంత్రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీకి సంబంధించిన అంశాలను మంత్రి పొంగులేటి సమాచార మంత్రులతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 2024 నుంచి బకాయి ఉన్న డిఏల్లో రెండు డిఏలను వెంటనే మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి నుంచి బకాయి పడ్డ ఏరియర్స్‌ను వాయిదాల్లో చెల్లించాలని మంత్రి వర్గం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డిఏ, పెన్షనర్లకు డిఆర్ మంజూరు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు.

-మిగతా 2 లో






## ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే

- ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం
- అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- చలికాలంలోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం
- అక్టోబర్--డిసెంబర్‌లో తక్కువ వర్షపాతం
- తెలంగాణలో 18 శాతం లోటు వర్షపాతం
- 19 జిల్లాల్లో లోటు.. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం
- నల్గొండ, నిర్మల్‌లో అత్యధిక వర్షపాతం లోటు
- కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాలలో అధిక వర్షపాతం
- ఎల్నినో ప్రభావం శీతాకాలంపైనా ఉంటుందన్న ఐఎండీ



## దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

- శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా
- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

హైదారాబాద్,
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్

-మిగతా 2 లో

# శభాష్ స్మిత్

### భారత్ కీర్తి రెపరెపలు

- భారతీయ పైలట్ మచ్చర్కు ప్రశంసల వెల్లువ
- భారత్ గర్విస్తోంది: ప్రధాని మోడీ
- అసలైన హీరో: నెతన్యాహు శాల్యూట్
- రియల్ హీరో: ట్రంప్ ప్రశంసలు
- రాష్ట్రపతి ముర్ము నుంచి రాజ్నాథ్, జైశంకర్ వరకు అభినందనలు

పై దుబాయ్ విమానంలో కోపైలట్ జరిపిన దాడిలోతీవ్రంగాగాయపడినప్పటికీ ప్రయాణికుల రక్షణ కోసం తన ప్రాణాలను రిస్క్‌లో పెట్టిన భారతీయ పైలట్ స్మిత్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆయనను రియల్ హీరోగా ప్రపంచాధినేతలు అభివర్ణించారు. మెరుగైన చికిత్స కోసం స్మిత్‌ను యుఎఇకి తరలించారు.
విమానం కూల్చడానికి ఒమన్ కు చెందిన కోపైలట్ ప్రయత్నించాడంటూ వార్తలు వెలువడుతున్నాయి. అతడిని ఓ మత ఛాందసవాదిగా ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు పేర్కొన్నారు.







## సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

- 24 బిలియన్లు దాటిన లావాదేవీలు
- ఏడాదిలో 23 శాతం పెరిగిన యూపీఐ లావాదేవీలు
- సెప్టెంబర్‌లో 24.07 బిలియన్ల ట్రాన్సాక్షన్లు
- లావాదేవీల విలువ రూ.29.37 లక్షల కోట్లు
- రోజుకు సగటున 802 మిలియన్ల లావాదేవీలు
- ఆగస్టుతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన లావాదేవీలు
- రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐపై ని 0.4 శాతం ఎండీఆర్ ప్రతిపాదన
- వ్యాపార సంఘాల నిరసనతో కేంద్రంతో చర్చలు
- చిన్న వ్యాపారులకు ఎండీఆర్ నుంచి మినహాయింపు

న్యూఢిల్లీ,
దేశంలో 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ' తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. సెప్టెంబర్ నెలలో కూడా యూపీఐ లావాదేవీలు పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 23 శాతం పెరిగి 24.07 బిలియన్లకు చేరుకుంది. ఇక లావాదేవీల విలువ

-మిగతా 2 లో

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు
# సిద్ధమా



### తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!

- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు రెడీ
- సిఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- రాష్ట్రంలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు
- ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయారా!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదారాబాద్,
తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం

-మిగతా 2 లో



## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్దం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు

హైదారాబాద్,
తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్దం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్దం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళిలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

-మిగతా 2 లో

## కాంగ్రెస్ మోసాలకు
# ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే బుద్ధి చెప్పాలి





**-రేవంత్ పాలనలో అన్ని వర్గాలు విలవిల -**
**మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఫైర్**
**-ఫీజు రీయింబర్స్, ఉద్యోగాల హామీలపై కాంగ్రెస్ నమ్మకద్రోహం**

**దేవరకొండ, అక్టోబర్ 1 (నవ సంఘర్షణ):**
రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో మోసపోని వర్గం లేదని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.
గురువారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.
విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. యువతను ఆకర్షించేందుకు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బకాయిల కారణంగా విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, సర్టిఫికెట్లు అందక ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారని, పేద విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించిందని తెలిపారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బకాయిలను కేసీఆర్ ప్రభుత్వం చెల్లించిందని, తమ హయాంలో వేల కోట్ల రూపాయలు చెల్లించామని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏల విషయంలో కూడా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని డిమాండ్ చేశారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు అత్యంత కీలకమని అన్నారు.
రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త తమ పరిధిలోని పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు.
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచే రేవంత్ రెడ్డి పతనం ప్రారంభమవుతుందని, తెలంగాణ ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ అభివృద్ధే ధ్యేయం





## - ఎమ్మెల్యే బాలు నాయక్

**-రూ.80.17 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**
**-మౌలిక వసతులపై ప్రజలతో ముఖాముఖి**

**దేవరకొండ, అక్టోబర్ 1 (నవ సంఘర్షణ):**
దేవరకొండ పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.
దేవరకొండ పట్టణంలోని 8వ వార్డులో రూ.80.17 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రారంభించారు. అనంతరం అదే వార్డులోని మరో కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటిస్తూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు.దేవరకొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజల అవసరాలను గుర్తించి దాదాపు రూ.20 కోట్లకు పైగా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని, మిగిలిన పనులను కూడా నాణ్యతతో త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.
ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, వైస్ చైర్‌పర్సన్ జువెరియా తబస్సుం సమీర్, స్థానిక కౌన్సిలర్ కేతావత్ అజయ్ చంద్ర, మహమ్మద్ రయిస్, నజీరుద్దీన్, పట్టణ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన చింతపల్లి మెకానికులు
# - చిన్నారుల భవిష్యత్తుకు 50 వేల భరోసా

### ఇద్దరు ఆడబిడ్డల పేరిట సుకన్య సమృద్ధి యోజనలో డిపాజిట్

**చింతపల్లి, అక్టోబర్ 1 (నవ సంఘర్షణ):**
చింతపల్లి గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ ఆదిమల్ల శేఖర్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అతని మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్న కుమార్తెల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ క్రమంలో శేఖర్ తో కలిసి పనిచేసిన తోటి బైక్ మెకానికులు మరోసారి తమ పెద్ద మనసును చాటుకున్నారు.
శేఖర్ కుటుంబానికి ఏదైనా సహాయం చేయాలని అందరూ కలిసి నిర్ణయించుకున్నారు. తమకు తోచిన విధంగా అందరూ డబ్బులు సేకరించి, ఆ డబ్బును వృధాగా ఇవ్వకుండా పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఆలోచించారు. అందులో భాగంగానే శేఖర్ ఇద్దరు కుమార్తెలు అయిన ఆదిమల్ల లాస్య పేరుపై 25,000 రూపాయలు మరియు ఆదిమల్ల అనన్య పేరుపై 25,000 రూపాయలు, మొత్తం 50 వేల రూపాయలను పోస్ట్ ఆఫీస్ లో సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు.తోటి మెకానికులు చేసిన ఈ సహాయాన్ని చూసిన చింతపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ఆ కుటుంబాన్ని ఆదుకోవడం నిజంగా గొప్ప విషయమని, వీరంతా ఇతరులకు



ఆదర్శంగా నిలిచారని గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మెకానికులు ఉప్పరమోని కిరణ్, ఎండి దస్తగిరి, నల్ల శ్రీపాల్, ఎస్కే బిక్కన్, కె నరేష్, నల్ల రామకృష్ణ, ఎస్కే ముస్తఫా, ఎండి కాజా తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు

## ఇందిరమ్మ ఇండ్ల
# ఎంపికలో పాల్గొన్న షబ్బీర్ అలీ

**- కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ హాజరు**





**కామారెడ్డి జిల్లా (నవ సంఘర్షణ):(అక్టోబర్ 2)**
కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం సొంత నివాస గృహాలను మంజూరు చేస్తుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి చైర్‌పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో
# రక్తదాన కార్యక్రమం

**- రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలి: వైద్యుల సూచన**



**కామారెడ్డి జిల్లా (నవ సంఘర్షణ): (అక్టోబర్ 1)**
అక్టోబర్ 1 జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం. సంజీవరెడ్డి, రెడ్ క్రాస్ స్టేట్ ఎంసీ సభ్యులు డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ఆసుపత్రి ఆర్ఎంఓలు డాక్టర్ రవీందర్ గౌడ్, డాక్టర్ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని సూచించారు.రక్తదాన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు నరాల వెంకటరెడ్డి, గోవర్ధన్, కిరణ్, శ్రీకాంత్, దత్తాత్రి, నవీన్, లింగం, నర్సారెడ్డితో పాటు ఆర్‌కే ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సంఘం
# రాష్ట్ర అధ్యక్షునిగా ఎర్ర శివరాజు

**- పలువురి రాష్ట్ర, జిల్లా సంఘం సభ్యుల అభినందనలు..**



**కామారెడ్డి జిల్లా (నవ సంఘర్షణ): (అక్టోబర్ 1)**
బహుజన సంఘం రాష్ట్ర నూతన కమిటీని గురువారం కామారెడ్డిలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎర్ర శివరాజును రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం రాష్ట్ర కమిటీతో పాటు కామారెడ్డి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.రాష్ట్ర కమిటీకి ఉపాధ్యక్షుడిగా బందెల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కుష్కర్ గంటి రమేష్, రాష్ట్ర సలహాదారుగా గురజాల గంగారాంను ఎన్నుకున్నారు.కామారెడ్డి జిల్లా కమిటీకి అధ్యక్షుడిగా వై. ప్రదీప్, ఉపాధ్యక్షుడిగా ఆర్. చిన్న లింగం, ప్రధాన కార్యదర్శిగా ఎస్. శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా పి. రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు.నూతన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సంపాదకీయం

# కౌలు రైతుకు రక్షణ కరవు



భారతదేశం వ్యవసాయిక దేశం అనడంలో ఎటువంటి సందేశానికి ఆస్కారం లేదు. భారత ప్రభుత్వ వ్యవసాయిక శాఖ 2024 -25 నివేదిక ప్రకారం మొత్తం నికర సాగు భూమి 35 కోట్ల ఎకరాలకు పైగా ఉంది. పచ్చికబయల్లు, తోటలు, సాగుకి అనుకూలమైన భూములు కలుపుకుంటే 44.1 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. దేశం మొత్తం భూమిలో ఇది 59%గా ఉంది. ఫ్యూడల్ వ్యవస్థనుంచి నేటి అర్ధభూస్వామ్య వ్యవస్థ వరకు కౌలుదారీ విధానం కొనసాగుతున్నది. అనధికారిక అంచనాల, ప్రపంచ బ్యాంకు, జాతీయ నమూనా సర్వే సంస్థల గణాంకాల ప్రకారం 2.13 కోట్లకుపైగా కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. ఇది ఖచ్చితమైన లెక్కగా భావించలేము. ఎందుకంటే 92% పైగా కౌలు ఒప్పందాలు నోటి మాటగానే ఉన్నాయి. అలాంటి వారికి కౌలు రైతులుగా గుర్తింపు ఉండదు. వారు రైతుల లెక్కల్లోకి రారు. అందువల్ల వాస్తవ పరిశీలనలో కౌలు రైతుల సంఖ్య కోట్ల కొద్ది పెరుగుతుంది. కౌలు రైతులు సాగు చేసే వాస్తవ భూమి 8.5 కోట్ల ఎకరాలు ఉంటుందని ఆర్థిక సంస్థల, స్వచ్ఛంద సంస్థల అధ్యయనాల అంచనాగా ఉంది.

దేశం లోని కౌలు రైతుల్లో 36% మందికి సొంత భూమి సెంట్ కూడా లేదు. దేశవ్యాప్తంగా సగటు కౌలు భూమి 25% దాకా ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో కౌలు భూమి చాలా ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిషన్, కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60% నుండి 70% కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 80% కౌలు రైతులే ఉన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో 50% పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా కౌలు రైతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఎపి రాష్ట్రంలోని కౌలు రైతుల్లో పదిలక్షల మందికి సెంటు సొంత భూమి లేదు. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ సాగు భూమిలో 35% భూమిని, మొత్తం రైతుల్లో 36% ఉన్న కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు కౌలు రైతుగా ఉన్నాడు. పంజాబ్ రాష్ట్రం వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందినా, అక్కడ దేశంలోనే అత్యధికంగా 73% కుటుంబాలకు సొంత భూమి లేదు. సుమారు 25% వ్యవసాయ కుటుంబాలు కౌలు రైతులుగా ఉన్నట్లు జాతీయ నమూనా సర్వే, వివిధ అధ్యయనాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 25% భూమి కౌలు ఒప్పందాల కిందనే సేద్యం సాగుతున్నది. బీహార్‌లో మొత్తం రైతుల్లో సుమారు 40% దాకా కౌలు రైతులు ఉన్నారని వివిధ వ్యవసాయ నివేదికలు, ఆర్థిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ కుటుంబాల్లో 91%పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సొంత భూమి లేకపోవడం వల్ల కౌలుదారులుగా ఇతరుల భూములు సాగు చేస్తున్నారు. సుమారు 23% భూమి కౌలు రూపంలో సేద్యం జరుగుతున్నది. ఇక్కడ కూడా నోటి మాట కౌలు విధానం అమలు జరుగుతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. భూకామందుల ప్రయోజనాలు కాపాడుతున్నాయి. రాత పూర్వక ఒప్పందం ఉంటేనే కౌలుదారుగా గుర్తింపు ఉంటుంది. రాత పూర్వక కౌలు ఒప్పందం లేకపోవడం వల్ల కౌలు రైతులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు లేవు. భూకామందు దయ మీద కౌలు భూమి ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ లోతెచ్చిన పంట సాగుదార్ల హక్కుల చట్టంలో భూయజమాని అనుమతి సంతకం ఉంటేనే కౌలు రైతుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుంది. భూ యజమానులు అలా సంతకం పెట్టటానికి అంగీకరించకపోవడంవల్ల కౌలురైతుగా గుర్తింపు లేక పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 87% మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వలేదు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ గణనీయంగా కౌలు రైతులు ఉండటానికి కారణం వారి సొంత భూమి లేకపోవడమే. భూ కేంద్రీకరణ పెరగడమే. దేశ వ్యవసాయ భూమిలో దాదాపు 44% భూమి కేవలం 10% అత్యంత ధనిక భూకామందు కుటుంబాల వద్ద ఉంది. వీరిలో కూడా 5% కుటుంబాల వద్ద 32% భూమి ఉంటే, 1% కుటుంబాలు ఏకంగా 10% భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. బీహార్‌లోని కొన్ని గ్రామాల్లో ఒక పెద్ద భూస్వామి కుటుంబం గ్రామం మొత్తం భూమిలో 20% కలిగి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు భూ కేంద్రీకరణను బద్దలు చేసి పేదలకు భూ పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పాలకులు చేసిన భూ సంస్కరణల చట్టాలన్నీ భూస్వామ్య వర్గానికి నష్టం లేకుండా చేసిన కావటమే అందుకు కారణంగా ఉంది. దేశంలోను, తెలుగు రాష్ట్రాల్లోను ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సాగునీరు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, మార్కెట్ సౌకర్యం లేకపోవడం, గిట్టుబాటు ధరలు రాక పోవడం. ఈ సమస్యలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. పై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి. సేద్యపు ఖర్చులు పెరుగుతున్న, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ముఖ్యంగా కౌలు రైతుల బాగా నష్టపోయి అప్పుల పాలై, తీర్చేమార్గం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దేశంలో 1995 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56% కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే (కౌలు రైతులు) ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75% నుండి 80% దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతుల తోసహా గ్రామీణ పేదలందరికీ భూ పంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్ధఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలుకొట్టాలి. ఈ పని నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమష్టిగా ఉద్యమించి సాధించుకోవాలి.

# శివ కేశవా.. ఏందీ పిచ్చి రాజకీయం!



మీకు తెలుసా? భక్తికి కూడా ఆస్తి పరిమితులు ఉంటాయట. దేవుళ్లలో ధనికులు, పేదలు ఉంటారట. ఇకపై మీరు పూజించే దేవుడిని బట్టి మీ ఆదాయ వర్గీకరణ ఈజీగా
చేయవచ్చు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్ ఇవ్వడం చాలా తేలికైపోతుంది. మీరు రాముడిని పూజించారనుకోండి.. మీరు డబ్బున్నోళ్ల కింద లెక్క.
శివుడిని పూజించారనుకోండి.. అటోమేటిక్‌గా ఈడబ్ల్యూఎస్ కోటాలోకి వచ్చేస్తారన్నమాట. ఈ మాట అంటున్నది ఎవరో కాదు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. రాముడు డబ్బున్నోళ్ల దేవుడంట. శివుడు పేదల దేవుడంట. రాముడు ఉత్తరాది దేవుడంట, శివుడు దక్షిణాది దేవుడంట.. దేవుళ్లకు సంబంధించి ఇదేం విభజననో అర్థం కాదు.రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయంగా నెత్తిన ముత్యాల తలంబ్రాలు పెట్టుకుని వెళ్లి, సాష్టాంగ ప్రణామం చేసి సమర్పణ చేసుకున్న దేవుడు ఎవరు? రాముడే కదా..! గోదావరి తీరంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఉన్న సీతారాములకు ఆలయం కట్టడానికి డబ్బులు ఇచ్చిన వాళ్లు అంతా ఎవరు? ఆ గోదావరి తీరంలో ఉండే పేద ప్రజలు కాదా? భద్రాచలం ఏజెన్సీలో ఇప్పటికీ ఉండే ప్రజలు ఎవరు? అక్కడ రామస్వామిని కనుక్కొన్న దమ్మక్క కోయ మహిళ. అక్కడ ఉండే ప్రజల్లో అత్యధికులు కోయలు, కొండ్రెడ్డులు, బంజారాలు.. వాళ్లందరూ కలిసి నిర్మించుకున్న దేవాలయం అది. స్థానిక గిరిజన సంప్రదాయాలతో ముడిపడిన దేవుడు భద్రాచల రాముడు.
అలాంటి రామచంద్రుడు ధనికుల దేవుడు ఎలా అవుతాడు? ఆ ఆలయాన్ని నిర్మించినందుకు పన్నెండేండ్లు చెరసాలలో మగ్గి సర్వస్వం ధారపోసిన భక్త రామదాసు త్యాగం ఇప్పుడు ఏమైపోయినట్టు? భద్రాద్రి కోదండరాముడి అస్తిత్వం, రామదాసు కీర్తనల వైభవం ఏమైపోయినట్టు? ఇప్పుడు ఆలయ అభివృద్ధికోసం అంటూ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నామని చెప్తున్నారే.. దేనికోసం పెడుతున్నట్టు? ముఖ్యమంత్రి ఇవన్నీ మర్చిపోయినట్టున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఎన్ని రామాలయాలు ఉన్నాయో ఒకసారి దేవాదాయ శాఖను అడిగి తెలుసుకుంటే మంచిది. కుతుబ్ షాహీ రాజు తానీషా స్వయంగా స్థాపించిన తలంబ్రాల సమర్పణ సంప్రదాయాన్ని ఇవాళ్టికీ ప్రభుత్వాలు నేటికీ పాటిస్తున్నాయంటే.. దానికి కారణం భద్రాద్రి రాముడు తెలంగాణ సాంస్కృతిక జీవన వైభవానికి నిలువెత్తు ప్రతీక. అక్కడి స్థానిక కథనమే చెప్తున్నదేందంటే.. రాములవారి పర్ణశాలే ఇక్కడ ఉన్నదని.
ఇక్కడి గోదావరి తీరంలోనే సీతారాములు పదేండ్లకు పైగా జీవించారని, ఇక్కడే సీతాపహరణం జరిగిందని.. ఇంత గొప్పగా సీతారాముల వనవాస కథనాలతో అనుసంధానం అయిన గొప్ప క్షేత్ర సంస్కృతిని దెబ్బ తీసేవిధంగా రాముడిని ఉత్తరాది వాడంటూ చిన్న చేయడం అంటే ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని చిన్నచేయడమే అవుతుంది.
తెలంగాణలో శివకేశవ ఆలయాలు లేని ఊరు ఒక్కటంటే ఒక్కటైనా చూపగలరా? భద్రాచలంలో, ఇల్లందకుంటలో, అమ్మపల్లిలో, రాచకొండలో, ధర్మపురిలో, డిచ్‌పల్లిలో రాముడి ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. ఇక తెలంగాణ గ్రామ గ్రామాన సీతారామ, కోదండరామ, రామచంద్రస్వామి దేవాలయాలు చాలా ఉన్నాయి. మరి రాముడు ఉత్తర భారత దేవుడు ఎలా అవుతాడు? రామ సంస్కృతి ఉత్తర భారత సంస్కృతి ఎలా అవుతుంది? అసలు శివకేశవ భేదం సృష్టించడం ద్వారా ముఖ్యమంత్రి సమాజాన్ని ఏం చేద్దామనుకుంటున్నారో తెలియడంలేదు. భద్రాచలంలోనే భద్రాద్రికి అనుబంధంగా ఉన్న రంగనాయకుల గుట్టపై రామలింగేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇల్లందకుంటలో త్రికూట నిర్మాణంలో శివలింగం ఉంటుంది. శిర్పనగండ్లలో రామాలయం, రామలింగేశ్వరుడు కలిసి ఉంటారు. బ్రాహ్మణ కొత్తపల్లిలో రాణి రుద్రమదేవి నిర్మించిన పట్టాభి సీతారామస్వామి ఆలయంలో అత్యంత పురాతనమైన శివ సన్నిధి ఉన్నది. తెలంగాణే కాదు.. మన ఆరాధన సంప్రదాయంలో శివ, కేశవ ఆరాధనలు పరస్పర విరోధాలు కావు. ఒకే క్షేత్ర సంప్రదాయంలో కలిసి ఉండేవి. రాముడు చెప్తేనే పోతన భాగవతాన్ని రాశాడు కదా..! మరి ఏ ప్రాతిపదికన శివుడు పేదల దేవుడు, రాముడు ధనికుల దేవుడు అని సీఎం విభజన రేఖ గీస్తున్నారు.
గతంలోనూ తెలంగాణలో మతపరమైన రాజకీయాలు చేసి సమాజాన్ని చీల్చే కుట్రలు చాలా జరిగాయి. కానీ, మన సమాజం ఇలాంటి రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించదు. ఇక్కడ ప్రజల్లో భక్తి ఉన్నది కానీ, మతోన్మాదం లేదు. మనుగడ కోసం దాదాపు 800 వందల ఏండ్లపాటు పోరాటం చేసిన సమాజం ఇది. అధిక్షేపం ఇక్కడి రక్తంలోనే ఉన్నది. పోతన లాంటి వాడే నా కావ్యాన్ని ఎవ్వడికీ ఇవ్వను పొమ్మన్నాడు. అలాంటిది ఉత్తరాదిలో మాదిరిగా ఇక్కడ మత రాజకీయాలు ప్రభావం చూపుతాయని అనుకోవడం భ్రమే. ఈ విషయం తెలంగాణలో బీజేపీ పరిస్థితి చూస్తేనే ఎవరికైనా అర్థమవుతుంది.
ఇక రాష్ట్రంలో బీజేపీకి తాను విధేయుడనని చాటుకోవడానికి అవకాశం దొరికినప్పు డల్లా రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తూనే ఉన్నారు. తాజా వ్యాఖ్యల్లో కూడా మోదీ నాలుగోసారి ఎలా గెలువాలో, ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలో ఒక ఏబీవీపీ మాజీ కార్యకర్తగా చిట్కా చెప్పారు కూడా. పాపం ఒరిజినల్ కాంగ్రెస్ వారికే ఈ వ్యవహారం అర్థం కావటం లేదు. లేదా.. తమకు వేరే ప్రత్యామ్నాయం లేక భరిస్తున్నారేమో తెలియదు. మరోవైపు ద్రవిడ ఉద్యమం అనేది ప్రధానంగా తమిళనాడుకే పరిమితమైంది. కొంతవరకు ఏపీ రాజకీయాలను తొలినాళ్లలో ప్రభావితం చేసింది. కానీ, తెలంగాణకు ఇలాంటి రాజకీయాలు పడవు. మనది పూర్తిగా లౌకిక ప్రజాస్వామ్య సమాజం. ఈ సమాజాన్ని మతపరమైన, జాతిపరమైన పరస్పర విరుద్ధమైన, చీలిక రాజకీయాలతో ప్రభావితం చేయడం సాధ్యమయ్యేపని కాదు. చివరగా ఒక్కమాట.
శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే,శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః
విష్ణు రూపంలో ఉన్న శివుడికి నమస్కారం.. శివుడి రూపంలో ఉన్న విష్ణువుకు నమస్కారం. శివుని హృదయంలో విష్ణువు ఉన్నాడు.. విష్ణువు హృదయంలో శివుడు ఉన్నాడని దీని అర్థం. ఈ ఒక్క శ్లోకం మన సమాజంలో వేల ఏండ్లుగా కొనసాగుతున్న సమన్వయ సంప్రదాయానికి ప్రతిబింబం. అలాంటి సమాజంలో ఫలానా దేవుడు ధనికుల దేవుడు, ఫలానా దేవుడు పేదల దేవుడు అంటే ప్రజలు నవ్వుకోరా.. అలా మాట్లాడినవాళ్లు నవ్వులపాలు కారా? ఆ మాత్రం లాజిక్ మిస్ అయితే ఎలా? ఆ మాత్రం ఆలోచన లేకపోతే ఎలా?

# నష్ట నివారణలో ఇసి

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. ఈమేరకు శనివారం ఎన్నికల సంఘం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేకపోవడం గమనార్హం. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది. స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు.
అలాగే ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో




సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్‌ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది. అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వవస్థీకరించాలి.

## మునుగోడు కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి మృతి

**పరామర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి**



**మునుగోడు అక్టోబర్ 1 నవ సంఘర్షణ**
మునుగోడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి పబ్బు వజ్రమ్మ గారు శనివారం (సెప్టెంబర్ 26, 2026) కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి గారు రాజు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు.నేడు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా, వజ్రమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి సర్పంచ్ విజయలక్ష్మి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నారాయణపురం మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్, గునిగంటి రాజు గౌడ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, బానోతు కిరణ్ నాయక్, ఎండీ సాదక్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థులు




**రామన్నపేట అక్టోబర్ 01 నవ సంఘర్షణ**
రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. 28,29 తేదీలలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియం లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలలో పాల్గొని అండర్ 14, విభాగంలో ఎస్.ప్రణీత, వి. మానస, ఎం. శరణ్య, పి.అమరనాథ్, అండర్ 17 విభాగంలో పి. నిషిత, ఎస్. అక్షిత, పి. నితిన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పి ఈ టి కల్పన ను కరస్పాండెంట్ తో పాటు ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె వి ఎన్ ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.'

## గ్రామస్తులు కలసికట్టుగా వన జాతర



**రామన్నపేట అక్టోబర్ 01 నవ సంఘర్షణ**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో గత కొంతకాలంగా వరస మరణాలు జరుగుతుండడంతో గ్రామస్తులు కలసికట్టుగా ఏక నిర్ణయంతో గ్రామము సుభిక్షంగా ఉండాలంటే గ్రామంలోని ప్రజలు ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండాలని ఒక రోజు ఊరు విడిచి వనవాసం వెళ్లాలని అడవిలో చెట్ల కింద బంధుమిత్రులు కుటుంబ సమేతంగా భోజనాలు చేయాలని కలసికట్టుగా ఊరు విడిచి ఒక పండగ వాతావరణం తలపించేలా గ్రామస్తులు వనవాసం వెళ్లడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, మా గ్రామంలోని ప్రజలందరూ పాడిపంటలు పశుసంపద పిల్లలు ఆయురారోగ్యాలతో ఉండాలనే,సంకల్పంతో వనవాసం వెళ్ళామని ఈ సందర్భంగా అన్నారు.

## చండూరులో దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ప్రారంభించిన చైర్మన్



**చండూరు అక్టోబర్ 1 నవ సంఘర్షణ**
చండూర్ మున్సిపాలిటీలో అలిమ్కో --- హైదరాబాద్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని గురువారం చండూరులో నిర్వహించారు. కస్తాల రోడ్డులోని భారతి చంద్ర గార్డెన్లో జరిగిన శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్చైర్లు, శ్రవణ యంత్రాలు, చంక కర్రలు, బ్రెయిలీ కిట్లు, స్మార్ట్ కేన్లు తదితర ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు.
దివ్యాంగులకు అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే సహాయక ఉపకరణాలు అందించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.

# వనస్థలిపురంలో ఘనంగా ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మాల్

**హైదరాబాద్, అక్టోబర్ 1 నవ సంఘర్షణ**
నాణ్యత, విస్తృతమైన కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సిఎంఆర్ షాపింగ్ మాల్, వనస్థలిపురంలో తన నూతన షోరూమ్ ను ఘనంగా ప్రారంభించారు . ఈ ప్రారంభోత్సవంలో వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందుబాటులోకి తీసుకువచ్చింది.
ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై నూతన షోరూమ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ గ్రూప్ చైర్మన్ శ్రీ మావూరి వెంకట రమణ, డైరెక్టర్ శ్రీ మావూరి బాలాజీ,లు పాల్గొన్నారు. అలాగే ఎక్స్ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ శ్రీ మధు యాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మల్లారెడ్డి రెడ్డి, ఎల్బీ నగర్ బీజేపీ ఇన్చార్జ్ శ్రీ సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీ కొప్పుల నరసింహారెడ్డి, యాదగిరిగుట్ట బోర్డు మెంబెర్ పి. ఈశ్వరమ్మ యాదవ్, షోరూమ్ యజమాని శ్రీ పి. కృష్ణ యాదవ్, శ్రీ సురేష్ యాదవ్ లు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవంలో తొలి కొనుగోలుదారుగా శ్రీ పి. కృష్ణ యాదవ్ నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్మీట్లో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, సిఎంఆర్ షాపింగ్ మాల్



లోని చీరల కలెక్షన్లు తనకు ఎంతో నచ్చాయని, తాను కూడా క్రమం తప్పకుండా సిఎంఆర్ లో షాపింగ్ చేస్తుంటానని తెలిపారు. ఇక్కడ లభించే విభిన్నమైన చీరల డిజైన్లు, కలెక్షన్ల పట్ల తనకున్న అభిరుచిని ఆమె వెల్లడించారు. వేదిక పై ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, వనస్థలిపురం ప్రజలకు తనపై ఎంతో అభిమానం ఉందని, అదే విధంగా తనకూ ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. అనంతరం వేదికపైనే పాటలకు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించారు. దీంతో ప్రారంభోత్సవ వేడుక మరింత ఉత్సాహభరితంగా మారింది. నూతనంగా ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మాల్ లో చీరలు, సంప్రదాయ దుస్తులు, పురుషులు, మహిళలు, చిన్నారుల వస్త్రాలతో పాటు విభిన్నమైన ఫ్యాషన్, లైఫ్ స్టైల్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అన్ని వయసుల వారికి, కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట విస్తృతమైన షాపింగ్ సౌకర్యాన్ని అందించేలా మాల్ను రూపొందించారు. ఈ సందర్భంగా సిఎంఆర్ షాపింగ్ మాల్ చైర్మన్ శ్రీ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను, ఆకర్షణీయమైన ధరలను అందించడంతో పాటు ప్రతి షాపింగ్ ను ఒక మధురమైన అనుభూతిగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వినియోగదారుల ఆదరణతో మరిన్ని ప్రాంతాలకు తమ సేవలను విస్తరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.
ప్రారంభోత్సవ కానుకగా ప్రింటెడ్ క్రేప్ సారీ కేవలం 89 రూపాయలకే అందిస్తూ మరెన్నో అద్భుతమైన ఆఫర్లను అన్ని కేటగిరీస్ లోను అందిస్తున్నామని తెలియజేశారు
వనస్థలిపురంలో నేటి నుంచి ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మాల్ స్థానిక ప్రజలకు సరికొత్త షాపింగ్ గమ్యస్థానంగా నిలవనుంది. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలందరూ నూతన షోరూమ్ ను సందర్శించి, విస్తృతమైన కలెక్షన్లను ఆస్వాదించాలని సిఎంఆర్ యాజమాన్యం ఆహ్వానించింది.

# మంత్రి నారా లోకేష్‌తో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ భేటీ.

**-జిల్లాలో పలు అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు నిధులు కోరుతూ లోకేష్ కి వినతి.**
**-జిల్లా రాజకీయాలపై లోకేష్ తో ఎంపీ చర్చలు.**
**-"ఏలూరు పార్లమెంట్ లో గత రెండేళ్లు" చేసిన అభివృద్ధి పనుల పుస్తకాన్ని లోకేష్ కి అందించిన ఎంపీ.**

**ఏలూరు, అక్టోబర్ 01 నవ సంఘర్షణ**
రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం ఉండవల్లి నివాసానికి వెళ్లిన ఎంపీ, జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించడంతోపాటు, ఏలూరు పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంత్రి లోకేష్ దృష్టికి



తీసుకువచ్చిన అంశాల్లో ముఖ్యంగా.. ఏలూరులో బీసీ హాస్టల్ నిర్మాణానికి 2 కోట్లు, ఏలూరు పట్టణంలో జిల్లా గ్రంథాలయం నిర్మాణానికి 3 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొయ్యలగూడెంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ఆర్థిక శాఖ నుంచి ఫైనాన్సియల్ క్లియరెన్స్ ఇప్పించమని కోరిన ఎంపీ, నూజివీడు IIITలో ఆధునికీకరణ, సౌకర్యాల కల్పనకు 12 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలను పరిశీలించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏలూరు పార్లమెంట్ పరిధిలోని రాజకీయ పరిస్థితులు, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఇరువురూ కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు పార్లమెంటు పరిధిలో చేసిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని నారా లోకేష్ కి అందించారు. పుస్తకాన్ని పరిశీలించిన లోకేష్ చేసిన పనులను ఇలా పుస్తక రూపంలో తేవడం బాగుందంటూ ప్రశంసించారు.

# స్వచ్ఛతా హీ సేవా 2026', స్వచ్ఛతా సంస్కార్, స్వభావ్ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ

**రంగారెడ్డి జిల్లా , అక్టోబర్ 01 నవ సంఘర్షణ**
శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపి చెరువు ప్రాంగణంలో సౌథర్న్ సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్ మరియు సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ శేరిలింగంపల్లి జోన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా 2026', స్వచ్ఛతా, సంస్కార్, స్వభావ్ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సేవా ఇస్లావత్ సీఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ తుమ్మల విక్రమ్ మరియు సీఆర్పీఎఫ్ సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేశవ్యాప్త 'స్వచ్ఛత హి సేవా 2026' ప్రచారంలో భాగంగా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం ఈ రోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్' (ఒక రోజు, ఒక గంట, అందరం కలిసి) అనే కార్యక్రమానికి అనుగుణంగా శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది, సీఆర్పీఎఫ్ సేవలను చైర్మన్ గాంధీ కొనియాడారు. పరిశుభ్రత, పౌర బాధ్యత మరియు సమాజం యొక్క క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగినది అని తెలియచేశారు. స్వచ్ఛతా హీ సేవా 2026' ప్రచారం దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2, 2026 వరకు నిర్వహించబడుతోంది అని "స్వచ్ఛత మే సహభాగ్, స్వచ్ఛ భారత్, విక్షిత్ భారత్" పరిశుభ్రతను ప్రజల సామూహిక బాధ్యతగా మార్చడం, స్వచ్ఛంద సేవా భావ మరియు ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలియచేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల పై అవగాహన కల్పించడం, శ్రమదానం, స్వచ్ఛతా ప్రతిజ్ఞ మరియు మొక్కలు నాటడం, పారిశుధ్య కార్మికుల (సఫాయిమిత్రుల) సంక్షేమం, భద్రత మరియు గౌరవం, ప్లాస్టిక్ నిషేధం, పాఠశాలలు, ప్రజా ప్రదేశాలలో పారిశుధ్య



కార్యక్రమాలు నిర్వహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలియచేశారు.
గోపి చెరువు వద్ద జరిగిన ఈ పరిశుభ్రత మరియు పారిశుధ్య పనులలో సీఆర్పీఎఫ్ సిబ్బందితో పాటు డోయన్స్ టౌన్షిప్ నివాసితులు మరియు సీఎంసీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది అని ,చెరువు గట్టున మొక్కలు నాటడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచడంలో తమ వంతు కృషి చేయాలని , ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత తో సమాజ హితం పని చేయాలని , గోపి చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, ప్రజలందరి భాగస్వామ్యంతో చెరువు ను శుభ్రపరచి, పరిరక్షించాలని, చెరువులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది అని తెలియచేశారు. పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన భారతదేశ లక్ష్యాన్ని సాధించడంలో 'జన్ భాగీదారి' (ప్రజల భాగస్వామ్యం) యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం నొక్కి చెప్పింది. సామాజిక బాధ్యత పట్ల మరియు ప్రభుత్వ స్వచ్ఛతా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో సీఆర్పీఎఫ్ కున్న నిబద్ధతను కూడా ఈ కార్యక్రమం పునరుద్ఘాటించింది అని తెలియచేశారు.
ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ శ్రీ తుమ్మల విక్రమ్, డిఐజి లు శ్రీ ప్రవీణ్ ఘూగ్, డాక్టర్ సంజయ్ కుమార్, శ్రీ పంకజ్ కుమార్, సిఎంసీ అధికారులు డీఈ ఆనంద్, , డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, లింగా రెడ్డి, గఫుర్, వార్డు మెంబర్ రాము, శ్రీకాంత్ దేవులపల్లి, నరసింహ రెడ్డి, నరసింహ, మహేందర్ సింగ్, మహేష్ చారీ, పవన్, సాయి, డోయన్స్ టౌన్షిప్ కార్యదర్శి శ్రీ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీ షాజీ మాథ్యూ, సలహాదారు శ్రీ లింగారెడ్డి మరియు నాయకులు స్థానిక నివాసితులు కూడా ఈ శ్రమదానంలో పాల్గొన్నారు.

# జింబాబ్వేలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి

మారోండెరా గ్రామీణ ప్రాంతంలో ప్రమాదం

హెలికాప్టర్‌లో ఏడుగురు ఉన్నట్లు ప్రభుత్వ ప్రకటన

ప్రముఖ వ్యాపారవేత్త సహా ఏడుగురు మృతి

ఇద్దరు పైలట్లు, నలుగురు ప్రయాణికులు మృతి

ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదు

ఘటనా స్థలానికి చేరుకున్న అత్యవసర సిబ్బంది

మృతుల సంఖ్యపై భిన్న కథనాలు

పూర్తి వివరాల కోసం కొనసాగుతున్న దర్యాప్తు



**హరారే:**
జింబాబ్వేలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని మారోండెరా గ్రామీణ ప్రాంతంలో బుధవారం హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ప్రముఖ వ్యాపారవేత్తతో పాటు నలుగురు ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా మొత్తం ఏడుగురు మృతి చెందినట్లు ప్రభుత్వ ప్రతినిధి నిక్ మంగ్వానా వెల్లడించారు. హెలికాప్టర్ ప్రమాదానికి గురైన విషయం తెలియగానే అత్యవసర సేవల సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసే ప్రక్రియను ప్రారంభించారు. ప్రమాదంలో ప్రయాణిస్తున్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల సంఖ్యపై భిన్నమైన సమాచారం వెలువడుతోంది. హెలికాప్టర్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంలో పోలీసుల వివరాలకు, ప్రభుత్వ ప్రతినిధి వెల్లడించిన సమాచారానికి పొంతన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మృతుల సంఖ్య అధికారికంగా వెల్లడించిన దానికంటే ఎక్కువగా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగానే కూలిపోయిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# జనన, మరణాల నమోదుకు కొత్త రూల్స్



**న్యూఢిల్లీ**
జనన-మరణాల నమోదు చట్టం-2026 గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జనన, మరణాల రిజిస్ట్రేషన్ల ఆలస్యంపై నిబంధనలు మరింత కఠినతరం కానున్నాయి. ఇక నుంచి వ్యక్తి జన్మించిన లేదా మరణించిన ఏడాది తర్వాత రెండేండ్ల లోపు సమాచారం ఇస్తే.. జిల్లా మెజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ లేదంటే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారం ఉన్న అధికారి తనిఖీ చేసి ఆదేశాలు ఇచ్చిన తర్వాత సంబంధిత రుసుము చెల్లించాక నమోదు చేస్తారు.. ఒకవేళ రెండేండ్లు దాటిన తర్వాత సమాచారం ఇస్తే ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ కొత్త చట్టం ప్రకారం జనన, మరణాల చట్టం 1969లోని 13(3)ను మార్చడంతో పాటు కొత్తగా సెక్షన్ 13(3ఏ)ను చేర్చారు.

## అన్ని విమానాశ్రయాల్లో ఫుల్ బాడీ స్కానర్లు!



**న్యూఢిల్లీ**
పశ్చిమాసియాలో ఫ్లైదుబాయ్ విమాన ఘటనతో భారత్ అప్రమత్తమైంది. ఇకపై అన్ని విమానాశ్రయాల్లో పూర్తి బాడీ స్కానర్లు (ఎఫ్‌బీఎస్)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైమానిక భద్రతా వ్యవస్థ పటిష్ఠతలో భాగంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్టు పౌరవిమానయాన శాఖ అధికారులు తెలిపారు. మొద టి దశలో ఎనిమిది విమానాశ్రయా ల్లో వీటిని ఏర్పాటు చేస్తామని ఆ శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా తెలిపారు. ఇప్పటికే మూడు ఎయిర్‌పోర్టులకు స్కానర్ మిషన్లను పంపినట్టు తెలిపారు. మిగిలిన ఐదింటిలో త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## ఎస్పీతో టచ్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు!

వెల్లడించిన అఖిలేశ్ యాదవ్



**లక్నో,**
చాలామంది బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీతో టచ్‌లో ఉన్నారని, అయితే వారందరికీ పార్టీలో స్థానం కల్పించడం కష్టమని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తామంటూ ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అయితే వారికి స్థానం కల్పించే పరిస్థితి పార్టీలో లేదని పేర్కొన్నారు. మేం కేవలం వారికి మాట ఇచ్చి తర్వాత వాటిని తప్పాలని అనుకోవడం లేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల మాదిరిగానే అదే కూటమి పార్టీలతో కలిసి వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పోటీకి దిగుతామని చెప్పారు. త్వరలోనే కూటమి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# తొమ్మిదేళ్ల తర్వాత కాంగ్రెస్‌లోకి వాఘేలా?

-కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమన్న శంకర్‌సింహ్ వాఘేలా

-రాహుల్‌గాంధీతో భేటీ తర్వాత తుది నిర్ణయం

-కాంగ్రెస్ నేతలతో కొనసాగుతున్న చర్చలు

-రణ్‌దీప్ సూర్జేవాలాతోనూ భేటీ

-అమిత్ చావ్డా, భరత్‌సింహ్ సోలంకితో చర్చలు

-2027 ఎన్నికలే చివరి అవకాశమన్న వాఘేలా

-2017లో కాంగ్రెస్‌ను వీడిన వాఘేలా

-సొంత పార్టీ కార్యక్రమాన్ని వాయిదా



గాంధీనగర్:
గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత శంకర్‌సింహ్ వాఘేలా దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతలతో తనకు చర్చలు జరుగుతున్నాయని వాఘేలా స్వయంగా వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌లో తిరిగి చేరడంపై తుది నిర్ణయం మాత్రం రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. 2027 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వాఘేలా తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నుంచి తనకు ఎలాంటి పదవి లేదా ఇతర ప్రయోజనాలు ఆశించడం లేదని, కాంగ్రెస్‌కు తన వంతు సహకారం అందించేందుకే తిరిగి రావాలని భావిస్తున్నట్లు చెప్పారు. వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్ గుజరాత్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా, గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా, మాజీ కేంద్ర మంత్రి భరత్‌సింహ్ సోలంకితో చర్చలు జరిపినట్లు సమాచారం. వాఘేలా తిరిగి పార్టీలోకి వచ్చే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు కొనసాగుతున్నాయని అమిత్ చావ్డా కూడా తెలిపారు. అయితే ఆయనకు పార్టీలో ఎలాంటి బాధ్యత అప్పగించాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2017లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు వాఘేలా కాంగ్రెస్‌ను వీడారు. ఆ తర్వాత వివిధ రాజకీయ ప్రయత్నాలు చేసిన ఆయన.. ప్రస్తుతం తిరిగి కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఆయన కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తారా అనే అంశంపై గుజరాత్ రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, అక్టోబర్ 2న తన సొంత పార్టీ 'ప్రజా శక్తి డెమోక్రటిక్ పార్టీ' కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు వాఘేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్‌తో జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. దీంతో ఆయన తదుపరి రాజకీయ అడుగు కాంగ్రెస్ వైపే ఉంటుందా అనే ఆసక్తి నెలకొంది. వాఘేలా కుమారుడు మహేంద్రసింహ్ వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం వాఘేలా పునరాగమనంపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా రాహుల్‌గాంధీతో వాఘేలా భేటీ తర్వాతే చేరికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఫ్రాన్స్‌లో జెన్ ఆల్ఫా నిరసనలు.. స్కూళ్ల సమస్యలపై విద్యార్థుల ఉద్యమం

-మెరుగైన పాఠశాల సదుపాయాల కోసం విద్యార్థుల ఆందోళన

-టైమ్‌టేబుల్‌పై విద్యార్థుల అభ్యంతరాలు

-తరగతుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గించాలని డిమాండ్

-టీచర్ల కొరతపై నిరసన

-ఉక్కపోత తరగతి గదులపై ఆగ్రహం

-పారిస్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించిన ఆందోళనలు

-400 స్కూళ్లపై నిరసనల ప్రభావం

-440 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**పారిస్:**
పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. కొన్ని చోట్ల చెత్త బుట్టలకు నిప్పు పెట్టడంతో పాటు పోలీసులపైకి వస్తువులు విసిరారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలపై విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేస్తున్నారు. పాఠశాలల టైమ్‌టేబుల్, ఒక్కో తరగతిలో ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత, ఉక్కపోతగా ఉండే తరగతి గదులు వంటి అంశాలను వారు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తొలుత పారిస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ ఆందోళనలు క్రమంగా దేశంలోని ఇతర నగరాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది నిరసన కవాతుల్లో పాల్గొన్నారని విద్యార్థి సంఘాలు తెలిపాయి. పాఠశాలల్లో తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నగర శివార్లకు చెందిన మేము నిర్లక్ష్యానికి, విస్మరణకు గురయ్యాం. ఇక్కడ పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయి' అని విక్టోయిర్ అనే 16 ఏళ్ల విద్యార్థిని పేర్కొంది. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని ఆమె ఆరోపించింది. మరోవైపు విద్యార్థుల నిరసనల ప్రభావంతో దేశవ్యాప్తంగా సుమారు 400 పాఠశాలలు ప్రభావితమైనట్లు ఫ్రాన్స్ విద్యాశాఖ వెల్లడించింది. ఆందోళనల సందర్భంగా 440 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ దేశ హోం మంత్రి లారెంట్ తెలిపారు. నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# బ్లూ డ్రమ్ తరహాలో మరో ఘటన..

**వృద్ధ మహిళను చంపి డ్రమ్ములో దాచిన దంపతులు**



యూపీ, మీరట్ బ్లూ డ్రమ్ తరహాలో ఒక వృద్ధురాలిని చంపి డ్రమ్ములో సిమెంట్‌తో పూడ్చిపెట్టారు దంపతులు. ఈ ఘటన జరిగి నాలుగేళ్లవుతోంది. ఈ ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగింది. అంతేకాదు.. ఈ దంపతులు మరో ఇద్దరు మహిళల్ని కూడా హతమార్చారు. హత్యకు గురైన ముగ్గురూ వారి కుటుంబ సభ్యులే. 2022లో ఈ ఘటన జరిగింది. మాధవ్ దాస్, ఊర్మిళ దంపతులు ఈ హత్యలకు పాల్పడ్డారు. మృతుల్లో ఒకరు ఊర్మిళ నానమ్మ శాంతాబెన్ వాసవ. రెండో మహిళ ఊర్మిళ సోదరి భాగవతి వాసవ. మూడో మహిళ మాధవ్‌దాస్ తల్లి మంజులాబెన్ సాధు. ముగ్గురినీ ఊపిరాడకుండా చేసి చంపారు. మొదట శాంతాబెన్ వాసవ అనే 70 ఏళ్ల వృద్ధురాలిని ఊపిరాడకుండా చేసి, ఇంట్లోనే హతమార్చారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఒక పెద్ద డ్రమ్ములో ఉంచారు. పైనుంచి సిమెంటు పోసి, పూడ్చేశారు. తర్వాత ఇంటి వెనుక పెరటిలో గొయ్యి తీసి, ఆ డ్రమ్మును పాతిపెట్టారు. ఈ హత్య 2022లో చేశారు. ఆ సమయంలో కోవిడ్ ఉధృతంగా ఉంది. శాంతాబెన్ ఏమైందని బంధువులు, చుట్టుపక్కల వాళ్లు అడిగితే.. కోవిడ్ కారణంగా మరణించిందని, దీంతో ఆస్పత్రి నుంచి నేరుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించామని చెప్పారు. ఆ తర్వాత కొంతకాలానికి భగవతిని, మంజులాబెన్‌ను కూడా వరుసగా ఈ దంపతులు హత్య చేశారు. అయితే, కొంతకాలానికి ఈ హత్యలకు పాల్పడ్డ మాధవ్‌దాస్-ఊర్మిళ దంపతులు విబేధాల కారణంగా విడిపోయారు. ఊర్మిళ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కొడుకుతోపాటు నగలు, డబ్బు వంటివి కూడా పట్టుకెళ్లింది. దీంతో భర్త మాధవ్‌దాస్ ఆమెపై పగతో రగిలిపోయాడు. భార్యపై ఎలాగైనా పగ తీర్చుకోవాలి అనుకున్నాడు. ఇందుకు తాము చేసిన హత్యలను వినియోగించుకోవాలని నిర్ణయించాడు. ఒక హత్యను భార్య చేసినట్లుగా ఫిర్యాదు చేశాడు. తన తల్లి మంజులాబెన్‌ను భార్య ఊర్మిళ, ఆమె సోదరుడు అఫ్జల్ కలిసి హత్య చేసినట్లు అహ్మదాబాద్ పోలీసులకు మాధవ్‌దాస్ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరుపుతున్న క్రమంలో మాధవ్ దాస్ చెబుతున్నదాంట్లో అనేక తప్పులు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో ఆరాతీయగా.. తన తల్లిని భార్యతో కలిసి తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. దీంతో ఈ ఒక్క హత్యపై విచారణ జరుపుతుండగా.. మిగతా రెండు హత్యల గురించి కూడా తెలిసింది. 2022లో ఈ హత్యలు జరగగా నాలుగేళ్ల తర్వాత ఈ ఘటన బయటపడింది. అది కూడా భర్త మాధవ్‌దాస్ చేసిన పొరపాటు, అతి తెలివి వల్లే.

# మహారాష్ట్రలో విషాదం..

**బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి**



మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు. ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు.

# బిజినెస్

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

-570 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
-198 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
-71,909.70 వద్ద ముగిసిన సెన్సెక్స్
-22,421.95 వద్ద స్థిరపడిన నిఫ్టీ
-లాభాల్లో వెల్స్పన్ లివింగ్, ఎంఫసిస్, ఇన్ఫోసిస్
-బజాజ్ ఆటోకు నష్టాలు
-చెన్నై పెట్రోలియం, సంసేరా ఇంజనీరింగ్ డౌన్
-భారీ అమ్మకాలతో మార్కెట్లకు నష్టం



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. ఉదయం నుంచి ఒడిదుడుకుల మధ్య కొనసాగిన సూచీలు చివర్లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ గణనీయంగా పతనమయ్యాయి. పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రధాన సూచీలు నష్టాల్లో స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు లేదా 0.79 శాతం నష్టపోయి 71,909.70 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 198.50 పాయింట్లు లేదా 0.88 శాతం క్షీణించి 22,421.95 వద్ద స్థిరపడింది. కీలక సూచీలు వరుసగా నష్టాలను నమోదు చేయడంతో మార్కెట్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కొన్ని కంపెనీల షేర్లు మాత్రం కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో కొనసాగాయి. వెల్స్పన్ లివింగ్, ఎంఫసిస్, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు బజాజ్ ఆటో, చెన్నై పెట్రోలియం, సంసేరా ఇంజనీరింగ్ షేర్లు నష్టాలను చవిచూశాయి. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో ఈ షేర్లు దిగువకు జారాయి. మొత్తంగా ప్రధాన సూచీలు గణనీయంగా నష్టపోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రతికూలంగా ముగిశాయి. సూచీల పతనంతో మదుపరులు తదుపరి మార్కెట్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

-24 క్యారెట్ల పసిడిపై రూ.330 తగ్గుదల
-10 గ్రాముల బంగారం రూ.1,49,240
-22 క్యారెట్ల బంగారంపై రూ.300 తగ్గింపు
-22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,800
-కేజీ వెండి ధర రూ.2,45,000
-హైదరాబాద్ బులియన్ మార్కెట్లో స్వల్ప మార్పు
-అంతర్జాతీయ పరిణామాల ప్రభావం
-ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గురువారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. వరుస మార్పులతో పసిడి ధరలు కదలాడుతున్న నేపథ్యంలో గురువారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 తగ్గి రూ.1,49,240కి చేరింది. బుధవారం నమోదైన ధరతో పోలిస్తే గురువారం పసిడి ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా తగ్గింది. రూ.300 మేర పతనమై రూ.1,36,800 వద్ద కొనసాగుతోంది. ఆభరణాల తయారీలో ప్రధానంగా వినియోగించే 22 క్యారెట్ల బంగారం ధర తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఉపశమనం లభించింది. మరోవైపు వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్ మార్కెట్లో కేజీ వెండి ధర రూ.2,45,000 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరలు స్వల్పంగా తగ్గినా వెండి ధర స్థిరంగా ఉండటం గమనార్హం. బులియన్ మార్కెట్లో ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి పలు అంశాల ఆధారంగా రోజువారీగా మారుతూ ఉంటాయి. దీంతో ఒకరోజు పెరిగిన ధరలు మరుసటి రోజు తగ్గడం, లేదా స్థిరంగా కొనసాగడం సాధారణంగా జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ప్రాంతాలను బట్టి స్వల్పంగా మారే అవకాశం ఉంటుంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, వ్యాపారుల మార్జిన్ల కారణంగా హైదరాబాద్ ధరలతో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో కొంత తేడా ఉండొచ్చు. కొనుగోలు చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోని స్థానిక బులియన్ మార్కెట్ ధరలను పరిశీలించడం మంచిది.

## భారీగా తగ్గిన క్రూడాయిల్ ధరలు

-అంతర్జాతీయ మార్కెట్లో భారీగా తగ్గిన చమురు ధరలు
-105 డాలర్లకు పైగా చేరిన బ్రెంట్ ధర
-తాజాగా 97.41 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్
-ఒక్కరోజులో సుమారు 6 డాలర్ల తగ్గుదల
-89.66 డాలర్ల వద్ద డబ్ల్యూటీఐ క్రూడ్
-మధ్యప్రాచ్యం నుంచి పెరిగిన చమురు రవాణా
-సరఫరా పెరగడంతో ధరలపై ఒత్తిడి
-అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం




అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇటీవల భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారీగా పెరిగిన చమురు ధరలు తాజాగా దిగివచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక దశలో 105 డాలర్లను దాటగా.. ప్రస్తుతం 97.41 డాలర్లకు చేరింది. బుధవారం (సెప్టెంబర్ 30) నమోదైన ధరతో పోలిస్తే దాదాపు 6 డాలర్ల మేర తగ్గడం గమనార్హం. మరోవైపు అమెరికా మార్కెట్‌కు సంబంధించిన డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా తగ్గింది. ప్రస్తుతం బ్యారెల్ డబ్ల్యూటీఐ క్రూడ్ 89.66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల్లో చోటుచేసుకున్న ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, సౌదీ అరేబియాపై హౌతీల దాడుల నేపథ్యంలో ఇటీవల చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు వేగంగా పెరిగి 105 డాలర్ల స్థాయిని దాటాయి. అయితే తాజాగా మధ్యప్రాచ్యం నుంచి చమురు రవాణా క్రమంగా పెరుగుతుండటంతో సరఫరాపై ఉన్న ఆందోళనలు కొంత తగ్గాయి. ముడిచమురు సరఫరా పెరగడం, మార్కెట్లో అందుబాటులో ఉన్న చమురు పరిమాణం మెరుగుపడటంతో ధరలపై ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ధరలు గణనీయంగా తగ్గాయి. ముడిచమురు ధరల కదలికలను అంతర్జాతీయ సరఫరా, డిమాండ్, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఉత్పత్తి దేశాల నిర్ణయాలు ప్రభావితం చేస్తుంటాయి. క్రూడాయిల్ ధరల్లో ఇలాంటి భారీ మార్పులు చోటుచేసుకుంటే దాని ప్రభావం ఇంధన మార్కెట్లతో పాటు రవాణా, తయారీ, ఇతర రంగాలపై కూడా పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఆధారపడే దేశాల్లో అంతర్జాతీయ ధరల కదలికలను మార్కెట్ వర్గాలు నిశితంగా పరిశీలిస్తుంటాయి.

# స్పోర్ట్స్

## హైవోల్టేజ్ గేమ్‌లో నెగ్గిన భారత్.. హాకీ ఫైనల్లోకి

-పాకిస్థాన్‌పై భారత్ 4-3తో విజయం
-ఆసియా క్రీడల ఫైనల్లోకి భారత పురుషుల జట్టు
-హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్
-సుఖ్‌జీత్ సింగ్ ఖాతాలో మరో గోల్
-3-0 ఆధిక్యం నుంచి పుంజుకున్న పాకిస్థాన్
-3-3తో ఉత్కంఠగా మారిన మ్యాచ్
-చివరి నిమిషంలో అభిషేక్ నిర్ణాయక గోల్
-మలేషియా-దక్షిణ కొరియా విజేతతో ఫైనల్ పోరు




కాకామిఘర: ఆసియా క్రీడలు-2026 పురుషుల హాకీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ 4-3 గోల్స్ తేడాతో ఓడించింది. మ్యాచ్ ఆరంభంలో 3-0 ఆధిక్యం సాధించిన భారత్‌కు పాకిస్థాన్ గట్టి పోటీ ఇస్తూ 3-3తో సమం చేసింది. చివరి నిమిషంలో అభిషేక్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ విజయాన్ని అందుకుంది. దీంతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు. 5వ, 13వ నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్లను అతడు గోల్స్‌గా మలిచి భారత్‌కు శుభారంభం అందించాడు. అనంతరం 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ సమయంలో భారత జట్టు పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే పాకిస్థాన్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 30వ నిమిషంలో అబూ మహ్మూద్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని 3-1కి తగ్గించాడు. ద్వితీయార్థంలో పాకిస్థాన్ మరింత దూకుడుగా ఆడింది. 45వ నిమిషంలో హన్నన్ షాహిద్ గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 3-2కి చేరింది. ఆ తర్వాత 49వ నిమిషంలో వహీద్ అష్రఫ్ రాణా గోల్ చేయడంతో స్కోరు 3-3తో సమమైంది. మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లడం ఖాయమనుకుంటున్న సమయంలో భారత్ చివరి నిమిషంలో విజయం సాధించింది. ఆట ముగియడానికి సుమారు 49 సెకన్ల ముందు అభిషేక్ గోల్ చేశాడు. అతడి షాట్ పాకిస్థాన్ డిఫెండర్ స్టిక్‌కు తగిలి దిశ మార్చుకుని గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో భారత్ 4-3 ఆధిక్యంలోకి వచ్చింది. మిగిలిన సమయాన్ని భారత ఆటగాళ్లు సమర్థంగా ఎదుర్కొని విజయాన్ని ఖాయం చేసుకున్నారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత జట్టు దూకుడుగా ఆడింది. వరుసగా పెనాల్టీ కార్నర్లు సాధిస్తూ పాకిస్థాన్ రక్షణపై ఒత్తిడి పెంచింది. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్, సుఖ్‌జీత్ మరో గోల్‌తో తొలి దశలోనే భారత్ భారీ ఆధిక్యం సాధించింది. అయితే రెండో అర్ధభాగంలో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుని భారత గోల్‌పోస్ట్‌పై దాడులు పెంచడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఉత్కంఠగా మారింది. 3-0 ఆధిక్యం కోల్పోయినప్పటికీ చివరి క్షణాల్లో భారత్ ఒత్తిడిని తట్టుకుని నిర్ణాయక గోల్ సాధించింది. అభిషేక్ చేసిన చివరి నిమిషం గోల్‌తో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఈ విజయంతో భారత పురుషుల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో వరుసగా స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకునే దిశగా మరో అడుగు ముందుకేసింది. ఫైనల్లో భారత్ మలేషియా, దక్షిణ కొరియా మధ్య జరిగే రెండో సెమీఫైనల్‌లో విజయం సాధించిన జట్టుతో తలపడనుంది. స్వర్ణ పతకం కోసం తుది పోరు అక్టోబర్ 3న జరగనుంది.

## సెమీస్‌లో శ్రీలంకపై భారత్ ఘన విజయం..

-శనివారం పాకిస్థాన్‌తో గోల్డ్ మెడల్ మ్యాచ్




**నగోయా:**
ఏషియన్ గేమ్స్ లో బిగ్ క్లాష్ జరగనున్నది. టీ20 సమరంలో దాయాదులు పాకిస్థాన్, భారత్ శనివారం తలపడనున్నాయి. ఇవాళ జరిగిన రెండో సెమీస్ మ్యాచ్‌లో భారత్ జట్టు 124 రన్స్ తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. జపాన్‌లోని నిషిన్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత జట్టు 7 వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. అయితే చేజింగ్‌లో శ్రీలంక చితికిలపడింది. కేవలం 9.5 ఓవర్లలో 45 రన్స్‌కే ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ రెండేసి వికెట్లు తీసుకున్నారు.పరుగులు రాబట్టడం కష్టంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు తొలుత తడబడ్డారు. ఇషాన్ కిషన్ చాకచక్యంగా బ్యాటింగ్ చేశాడు. 46 బంతుల్లో 80 రన్స్ చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. ఇక ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 21 బంతుల్లో సూర్యవంశీ 38 రన్స్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 170 టార్గెట్‌తో చేజింగ్‌కు దిగిన శ్రీలంక ఏ దశలోనూ భారత బౌలర్లను ఎదుర్కోలేకపోయింది. అయిదుగురు లంక బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఫెర్నాండో ఒక్కడే రెండు అంకెల స్కోరు చేశాడు. మరో వైపు బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో పాకిస్థాన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 13 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 111 రన్స్ చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్ 11.3 ఓవర్లలో టార్గెట్‌ను అందుకున్నది. అబ్దుల్ సమద్ 30, నవాజ్ 27 రన్స్ చేసి పాక్‌ను గెలిపించారు. ఇక ఇండియా, పాకిస్థాన్ జట్లు శనివారం జరిగే గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో పోటీపడనున్నాయి.

## గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో నితేశ్‌కు రజతం

-97 కేజీల విభాగంలో రజత పతకం
-ఫైనల్లో నితేశ్ సివాచ్‌కు పరాజయం
-జపాన్ రెజ్లర్ యూరి నకాజాటో చేతిలో ఓటమి
-0-4 పాయింట్ల తేడాతో నితేశ్ పరాజయం
-నితేశ్‌కు గట్టి పోటీ ఇచ్చిన నకాజాటో
-తొలి బౌట్‌లో 2-0 ఆధిక్యం సాధించిన జపాన్ రెజ్లర్
-చివరి నిమిషంలోనూ నితేశ్ ప్రయత్నాలు విఫలం
-గ్రీకో రోమన్‌లో భారత్‌కు మరో పతకం




నగోయా:
జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో భారత్‌కు మరో పతకం లభించింది. గ్రీకో రోమన్ రెజ్లింగ్ 97 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నితేశ్ సివాచ్ రజత పతకాన్ని సాధించాడు. గురువారం జరిగిన ఫైనల్లో నితేశ్ 0-4 పాయింట్ల తేడాతో జపాన్‌కు చెందిన యూరి నకాజాటో చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో స్వర్ణ పతకాన్ని కోల్పోయిన నితేశ్ రజతంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్ పోరులో నితేశ్ ఆరంభం నుంచే గట్టిగా పోరాడాడు. ప్రత్యర్థిపై గ్రిప్ సాధించేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. అయితే స్థానిక రెజ్లర్‌గా బరిలోకి దిగిన నకాజాటో భారత ఆటగాడి వ్యూహాలను సమర్థంగా అడ్డుకున్నాడు. నితేశ్‌కు స్కోరింగ్ అవకాశం ఇవ్వకుండా తన రక్షణను పటిష్ఠంగా కొనసాగించాడు. తొలి బౌట్‌లో నకాజాటో 2-0 ఆధిక్యం సాధించాడు. ఆ తర్వాత రెండో బౌట్‌లోనూ జపాన్ రెజ్లర్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. నితేశ్‌ను నేలకూల్చి మరో రెండు పాయింట్లు సాధించడంతో ఆధిక్యం 4-0కు చేరింది. దీంతో నితేశ్‌పై ఒత్తిడి పెరిగింది. చివరి నిమిషంలో నితేశ్ దూకుడుగా ఆడుతూ పాయింట్లు సాధించేందుకు ప్రయత్నించాడు. అయితే నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో భారత రెజ్లర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నాడు. నితేశ్‌కు ఒక్క పాయింట్ కూడా దక్కకుండా ఫైనల్‌ను ముగించాడు. దీంతో 4-0 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. నితేశ్ ఫైనల్ వరకు అద్భుతంగా పోరాడి రజత పతకాన్ని సాధించడం ద్వారా భారత ఖాతాలో మరో పతకాన్ని చేర్చాడు. గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో భారత్‌కు గతంలో రెండుసార్లు స్వర్ణ పతకాలు లభించాయి. 1962లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో 52 కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు సాధించారు. ఈసారి 97 కేజీల విభాగంలో నితేశ్ సివాచ్ ఫైనల్ వరకు చేరుకుని రజత పతకం సాధించడం ద్వారా గ్రీకో రోమన్ రెజ్లింగ్‌లో భారత్ తరఫున తన పేరును నమోదు చేసుకున్నాడు. స్వర్ణం కోసం జరిగిన తుది పోరులో ఓటమి ఎదురైనా.. పోటీలో చివరి వరకు పోరాడి రజత పతకాన్ని దక్కించుకున్నాడు.

# ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ 'సర్దార్ 2'




కార్తీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'సర్దార్ 2' ఎట్టకేలకు డిజిటల్ మాధ్యమంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ రెండవ భాగంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలై నెగిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయాన్ని అందుకుంది. ఇక దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో కార్తీ మరోసారి ద్విపాత్రాభినయంతో అదరగొట్టారు. ఇక ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా, మాళవిక మోహనన్ , ఆషికా రంగనాథ్ , రజీషా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.




## రెండు పార్టులుగా
# అల్లు అర్జున్ 'రాకా'?




పాన్-ఇండియా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'రాకా' చుట్టూ ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. మాస్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్, యాక్షన్ థ్రిల్లర్‌ను ఒకే పార్టుగా కాకుండా ఏకంగా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన కథా పరిధి ఊహకందనంత పెద్దదిగా ఉండటంతో పాటు, విభిన్న టైమ్‌లైన్స్ మరియు మల్టిపుల్ గెటప్స్‌తో కూడిన ఒక గ్లోబల్ వరల్డ్‌ను ఈ చిత్రంలో డైరెక్టర్ ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తున్న విశాలమైన నేపథ్యానికి పూర్తి న్యాయం చేయాలంటే, ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విభజించడమే సరైన మార్గమని చిత్ర యూనిట్ భావిస్తోందట. ఒకవేళ ఈ ప్లాన్ కనుక పక్కా అయితే, ఈ విజువల్ వండర్ మూవీకి సంబంధించిన మొదటి పార్టు డిసెంబర్ 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని, రెండో పార్టు 2028లో థియేటర్లలోకి వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



## యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి'
# ట్రైలర్ విడుదల..

**-నవ్వులు పంచుతూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హర్రర్-కామెడీ!**




బాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా హర్రర్-కామెడీ 'నైయ్ నవెల్లి' . తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ హీరోయిన్ యామి గౌతమ్ ధర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఇక ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినీ వర్గాల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో యామి గౌతమ్ సరసన ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ , హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ మరియు అమెజాన్ ఎంజిఎం స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. ఎంతో అస్తవ్యస్తంగా, గందరగోళంగా ఉన్న ఒక సాధారణ కుటుంబంలోకి యామి గౌతమ్ కొత్త కోడలిగా ప్రవేశించడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలోని అందరి జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చి, ప్రశాంతత చేకూరుతుంది. అయితే, ఆ ఇంట్లోని మరిది పాత్రలో నటిస్తున్న ఆదినాథ్‌కు ఆ కొత్త కోడలు ప్రవర్తన మరియు ఆమె పద్ధతుల మీద అనుమానం కలుగుతుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కోడలు నిజంగానే ఆ కుటుంబానికి దేవతలాంటి మనిషా లేక ఆమె వెనుక మరేదైనా దెయ్యం లేదా అంతుచిక్కని రహస్యం దాగుందా అనే కోణంలో ఈ ట్రైలర్ చాలా ఉత్కంఠభరితంగా, నవ్వులు పూయిస్తూనే వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతుంది. హర్రర్ మరియు కామెడీని చాలా చక్కగా మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్

దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన 'లోక ఛాప్టర్-1' చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె 'ప్రళయ్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి.ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిట్‌నెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్ ఉందని చెబుతున్నారు. 'ప్రళయ్' చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# రానా సమర్పణలో కార్తీక్ సుబ్బరాజు గే లవ్‌స్టోరీ 'డోరతీ'

**-తెలుగు ట్రైలర్ రిలీజ్**




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త బోల్డ్ అండ్ ఎమోషనల్ డ్రామా చిత్రం 'డోరతీ' . ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా నిర్మించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషించగా, సనంత్, రిషికాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా తెలుగులోకి రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ప్రముఖ నటుడు రానా దగ్గుబాటికి చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సమాజంలోని పక్షపాతాలు, లింగ సమానత్వం, LGBTQIA+ మరియు జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే విభిన్నమైన, ధైర్యమైన కథాంశాన్ని కార్తీక్ సుబ్బరాజు ఆవిష్కరించారు. టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం.